
E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 11-02-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:41 || పేజీలు–6 www.ekaburu.com



నా పేరును మార్చడానికి మీరెవరు?
.. రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం
» 3లో

## స్పీకర్‌పై అవిశ్వాసం



- ఆయన తొలగింపునకు 118 మంది ఎంపీల నోటీసు
- ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- చర్చ పూర్తయ్యేవరకు విధులకు దూరంగా సభాపతి
- నిబంధనల మేరకు చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**ఈ కబురు ఢిల్లీ:**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలో 118 మంది విపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు సమర్పించారు. సభను నిర్వహించడంలో బిర్లా తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులపై ఆయన కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని కూడా దానిలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 94(సి) అధికరణం కింద లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్, చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మహమ్మద్ జావెద్ తదితరులు నోటీసును అందజేశారు.

తరువాయి 2లో

### తెలంగాణలో రేపే మున్సిపల్ ఎన్నికలు
# సర్వం సిద్ధం

- తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 52 లక్షల మందికి పైగా ఓటర్లు
- మొత్తం 2,981 వార్డులకు బరిలో 12,944 మంది అభ్యర్థులు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్
- రీపోలింగ్ అవసరమైతే రేపు నిర్వహణ
- మక్తల్ ఆరో వార్డు ఎన్నిక వాయిదా
- 13న లెక్కింపు.. 16న మేయర్, ఛైర్‌పర్సన్ల ఎన్నిక






**ఈ కబురు ; తెలంగాణలో పురపాలక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో బుధవారం (ఫిబ్రవరి 11) పోలింగ్ జరగనుండగా, ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.**

ఈ ఎన్నికల్లో మొత్తం 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 8,191 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటర్ స్లిప్పులను ఎస్ఈసీ వెబ్‌సైట్ లేదా TE POLL యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 2,981 వార్డులకు గాను 12,944 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు పోలింగ్ జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీల్లో 12 మంది అభ్యర్థులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ నుంచి 2,358 మంది, బీఆర్ఎస్ నుంచి 2,478 మంది, బీజేపీ నుంచి 2,252 మంది సహా మొత్తం 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే, సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డులో పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది. మున్సిపాలిటీల కోసం 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

తరువాయి 2లో




## స్పీకర్ తొలగింపా.. ఇంతవరకు చూడలేదు

- మూడుసార్లు విఫల యత్నాలు

ఈ కబురు ఢిల్లీ: లోక్‌సభ స్పీకర్‌ను ఆ పదవి నుంచి తొలగింపజేసేందుకు ఇదివరకు స్వతంత్ర భారత చరిత్రలో మూడుసార్లు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన నోటీసు చర్చనీయాంశమయింది.




## లైంగిక దాడుల కేసుల్లో నిర్లక్ష్యపు వ్యాఖ్యల నియంత్రణకు చర్యలు

- కోర్టుల కట్టడికి సుప్రీం

ఈ కబురు ఢిల్లీ: లైంగిక దాడులకు సంబంధించిన కేసుల్లో హైకోర్టులు, దిగువ కోర్టుల నిర్లక్ష్యపూరిత, అసంబద్ధ వ్యాఖ్యల నియంత్రణకు మార్గనిర్దేశాలను జారీ చేయాలని యోచిస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది.




## కొండాపూర్ జంగమోనికుంట కబ్జాపై హైడ్రా యాక్షన్

- రూ.700 కోట్ల విలువైన 4 ఎకరాల చెరువును కాపాడి ఫెన్సింగ్ వేసిన అధికారులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**: చెరువును ఆక్రమించి.. మట్టితో చదును చేసి... ప్లాట్లను చేసి విక్రయించేందుకు సిద్ధం చేసిన వైనంపై హైడ్రా యాక్షన్ కు దిగింది

### సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్
## ప్రధాని మోదీ వ్యాఖ్య

**ఈ కబురు ఢిల్లీ:**
ఢిల్లీ: ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మ విశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన 'బస్తర్ పండుమ్'పై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో బస్తర్ ప్రాంతపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు.



తరువాయి 2లో

### తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు
# కేంద్రం నుంచి కీలక ప్రకటన

- బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి
- ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి




**ఈ కబురు;**
తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## నాటి పరికరాలతో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు

- భారాసపై మంత్రి పొంగులేటి ఆరోపణ
- వాటిని ఎక్కడ దాచారో విచారించి.. చర్యలు తీసుకుంటామని వెల్లడి

**ఈ కబురు, ఖమ్మం:**
భారాస హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన ఆ పార్టీ నాయకులు.. నాటి పరికరాలతో ఇప్పటికీ తమ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఆ పరికరాలు ఎవరింట్లో, ఏయే ఫాంహౌస్‌లలో దాచారో, ఎంతమంది ఫోన్లను అక్రమంగా వింటున్నారో విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖమ్మంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉద్యోగులు ఓటర్లు కాదా.. పార్టీ కోసం ఓటేయాలని వారిని అడగటంలో తప్పేంట'ని మంత్రి ప్రశ్నించారు. ఉద్యోగులతో తాను జరిపిన ఫోన్ సంభాషణను ఖమ్మంలో భారాస నాయకులు విడుదల చేయటంపై ఆయన ఈ విధంగాస్పందించారు.



తరువాయి 2లో



### తెలంగాణపై కేంద్రం
## తీవ్ర వివక్ష

- రాజకీయ దురుద్దేశంతో నిధుల్లో కోత
- రాష్ట్రం ఇచ్చేది రూ.1.33 లక్షల కోట్లు.. తిరిగొచ్చేది రూ.51 వేల కోట్లే
- మంత్రి తుమ్మల ధ్వజం


**ఈ-కబురు, హైదరాబాద్:**
కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో తెలంగాణపై తీవ్ర వివక్ష చూపుతూ..దగా చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో చేర్చాలంటూ రాష్ట్రం పంపిన ప్రతిపాదనలలో ఒక్కదాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి వివిధ పన్నుల రూపంలో రూ.1,33,208 కోట్లు కేంద్ర ఖజానాకు వెళ్తుండగా..

తరువాయి 3లో

# రాజపత్రం సిద్ధం

- ఓఆర్ఆర్ పరిధిలో 3 కార్పొరేషన్ల ఏర్పాటుకు ఏ క్షణమైనా గెజిట్ విడుదల

**ఈ కబురు,హైదరాబాద్**
**ఇప్పటివరకు జీహెచ్ఎంసీగా ఉన్న ఓఆర్ఆర్ పరిధి బుధవారం నుంచి మూడు కార్పొరేషన్లుగా మారనుంది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు డీలిమిటేషన్‌తో 243 అయ్యాయి. విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో 57 డివిజన్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 300 డివిజన్లకు విస్తరించిన జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ లక్ష్యాలతో మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీ చట్టం-1955, సెక్షన్-3(1) ప్రకారం జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాజపత్రం సిద్ధం చేసింది. ఏ క్షణమైనా గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఆ ఉత్తర్వు ప్రకారం బుధవారం నుంచి నూతన కార్పొరేషన్లు వేర్వేరుగా పని చేయనున్నాయి.**



**టీసీయూఆర్ పరిధిలో..**
రాష్ట్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ వరకు ఉన్న 2 వేల చ.కి.మీ విస్తీర్ణంలోని నగరాన్ని టీసీయూఆర్(తెలంగాణ ప్రధాన పట్టణ ప్రాంతం)గా పేర్కొంటూ రెండేళ్ల కిందట ఉత్తర్వు జారీ చేసింది. ఓఆర్ఆర్ పరిధిలోని భూభాగంలో ఒకేరకమైన పరిపాలన వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో సర్పంచుల పదవీకాలం ముగియగానే సెప్టెంబరు 2, 2024న శివారులోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేసింది. 2025 జనవరిలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకమండళ్ల గడువు ముగియగా ఆ ఏడాది నవంబరులో 20 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేసింది. అనంతరం జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం డివిజన్ల పునర్విభజనను పూర్తి చేసింది. విశాల నగరంలో 300 డివిజన్లు ఏర్పాటయ్యాయి. 60 సర్కిళ్లు, 12 జోన్లతో పరిపాలన వ్యవస్థ కొలువుదీరింది. ఫిబ్రవరి 10, 2026తో జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు పూర్తవడంతో ఆ వెంటనే హైదరాబాద్ మహానగర పాలక సంస్థను మూడు స్థానిక సంస్థలుగా విభజించే ప్రక్రియ పూర్తికావొచ్చింది.

తరువాయి 2లో

## ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం ఎందుకు డిమాండ్ చేయరు?

- కృష్ణా జలాల్లో 664 టీఎంసీలను ఏపీ తీసుకుపోయింది
- రాష్ట్ర హక్కుల కోసం ప్రత్యక్ష పోరాటం చేస్తాం: హరీశ్‌రావు




**ఈ కబురు,హైదరాబాద్**
కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకుపోతుంటే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు డిమాండ్ చేయడం లేదని భారాస శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ అవసరాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. కృష్ణా జలాల హక్కుల కోసం భారాస ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని వెల్లడించారు

తరువాయి 2లో

# తెలంగాణలో రేపే మున్సిపల్ ఎన్నికలు సర్వం సిద్ధం

మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ నుంచి 410, బీఆర్ఎస్ నుంచి 401, బీజేపీ నుంచి 382 మంది సహా మొత్తం 2,225 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్ల పరిధిలో 2,174 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరించామని వివరించారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లోని కేంద్రాల బయట నిఘా కెమెరాలు కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ

ఎన్నికల కోసం డివిజన్లు, వార్డుల వారీగా ఫొటో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయింది. ఎన్నికల సంఘం రూపొందించిన టీపోల్ యాప్‌లోకి వెళ్లి ఓటర్ గుర్తింపు కార్డు (ఎపిక్) నంబరు సాయంతో స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడానికి దీనిని ఉపయోగించవచ్చు. ఓటర్ల సహాయం కోసం 92400 21456 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని కోరారు. స్థానిక పాలనను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు ఇంటింటికి పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులతోపాటు ఏదైనా ఆమోదిత గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చని చెప్పారు.




## సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్ ప్రధాని మోదీ వ్యాఖ్య



ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'గతంలో బస్తర్ అనగానే మావోయిజం, హింస, వెనుకబాటుతనం గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు బస్తర్ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. స్థానిక ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. ఈ ప్రాంతం భవిష్యత్తులోనూ శాంతి, ప్రగతి, సాంస్కృతిక గౌరవంతో నిండి ఉండాలని నేను ఆశిస్తున్నాను' అని 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు పెట్టారు. ఈ నెల 7న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించిన ఈ ఉత్సవం, గిరిజనులు హస్తకళలు, స్థానిక వంటకాలు, సంప్రదాయ గిరిజన నృత్యాలు, జానపద గీతాలతో బస్తర్ వైభవాన్ని చాటి చెప్పింది.

## ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం ఎందుకు డిమాండ్ చేయరు?




. అవసరమైతే కేఆర్ఎంబీని ముట్టడిస్తామని, పార్లమెంట్‌లో ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం పార్టీ శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే వివేకానందతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "కృష్ణా జలాల్లో 664 టీఎంసీలను(80శాతం) ఏపీ వాడుకుంది. ఇదే విషయాన్ని జనవరి 28న కేఆర్ఎంబీకి అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్సీ లేఖ రాశారు.

అదే నెల 31న ఆయన రిటైరవగా ఈ పోస్టును ఖాళీగా ఎందుకు పెట్టారు? ఈ రోజు(మంగళవారం) కూడా ఏపీ ఒకటిన్నర టీఎంసీల నీటిని తరలించుకుపోయింది. ఈఎన్సీ లేఖ ప్రకారం కోటాకు మించి అదనంగా 16 టీఎంసీలను ఏపీ తీసుకెళ్లింది. ఈ నెల 6న ఏపీకి కేఆర్ఎంబీ.. ఇప్పటి వరకు 555 టీఎంసీల నీటిని తరలించారని, వాడకాన్ని ఆపాలని లేఖ రాసింది. కేంద్రంలో.. మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ వ్యవహారంలో ఏం చేస్తున్నారు? కాంగ్రెస్, భాజపాలు తెలంగాణ నీటి హక్కును ఏపీకి దోచిపెడుతున్నాయి. ఏపీకి నీటి మళ్లింపులను ఆపి శ్రీశైలం, సాగర్‌లకు భవిష్యత్తు అవసరాల కోసం రాష్ట్ర వాటాను తరలించాలి. భారాస ప్రభుత్వం కృష్ణానదిపై 19 చోట్ల టెలిమెట్రీలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటీ పెట్టలేదు. ఇందుకోసం ఇచ్చిన రూ.4 కోట్లను బోర్డు వాడుకున్నా సీఎం నోరు విప్పడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# స్పీకర్‌పై అవిశ్వాసం



కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, వామపక్షాలు, ఆర్జేడీ, శివసేనయూబీటీ, ఎన్సీపీఎస్పీ తదితర పార్టీల సభ్యులు దీనిపై సంతకాలు చేశారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ మాత్రం సంతకం చేయలేదు. తృణమూల్ తరఫున ఎవరి ప్రాతినిధ్యం లేదు. నిబంధనల ప్రకారం ఈ అంశంపై చర్చ పూర్తయ్యేవరకు సభకు రాకూడదని ఓం బిర్లా నిర్ణయించుకున్నారు. 1) నరవణె రచించిన పుస్తకంపై మాట్లాడేందుకు రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం 2) మాజీ ప్రధానమంత్రులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు తీసుకోకపోవడం 3) ఎనిమిది మంది ఎంపీలను సస్పెన్షన్‌లో ఉంచడం.. ఈ మూడింటికి నిరసనగా స్పీకరుపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని విపక్షం తీర్మానించింది. కొందరు కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చన్న పక్కా సమాచారంతో సభకు రావద్దని ప్రధానికి తానే సూచించినట్లు స్పీకర్ ఇటీవల చెప్పడం కూడా ప్రతిపక్షాలకు ఆగ్రహం కలిగించింది.

మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదు: గొగొయ్

మీడియాతో గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ.. సభలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని, ప్రజా సమస్యలు లేవనెత్తే హక్కును పదేపదే నిరాకరిస్తున్నారని ఆరోపించారు.

స్పీకర్‌పై వ్యక్తిగత గౌరవం ఉన్నా అసాధారణ పరిస్థితుల్లోనే అవిశ్వాస తీర్మానం తీసుకురావాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాత్రమే కాకుండా చాలా సందర్భాల్లో రాహుల్‌గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. న్యాయసమ్మతమైన ప్రజా సంబంధిత అంశాలు లేవనెత్తనీయకుండా స్పీకర్ తమను అడ్డుకుంటున్నారని విమర్శిస్తున్నాయి. విపక్ష నేతలు ముందుగా రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమై నోటీసుపై తుది నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఇచ్చిన నోటీసును మధ్యాహ్నం వెనక్కి తీసుకుని, తేదీని సరిచేసి మరొకటి ఇచ్చారు. నోటీసును పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని సెక్రటరీ జనరల్‌ను స్పీకర్ ఆదేశించారు. విరామం తర్వాత జరిగే రెండో విడత సమావేశాల్లో మార్చి 9న ఇది సభ పరిశీలనకు రానుందని సమాచారం. తీర్మానం చర్చకు వస్తే స్పీకర్ తన వాదన వినిపించేందుకు అవకాశం లభిస్తుంది. ముందుగా స్పీకర్‌కు లేఖరాసి అభ్యంతరాలను తెలియజేయాలని, 23 రోజుల్లో స్పందన రాకపోతే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని తృణమూల్ కాంగ్రెస్ అభిప్రాయం.

బడ్జెట్‌పై మొదలైన చర్చ

లోక్‌సభలో మంగళవారం విపక్ష నిరసనలు కొనసాగాయి. ప్రశ్నోత్తరాల సమయంలోనూ నినాదాలు ఆగలేదు. సభాపతి స్థానాన్ని విపక్ష సభ్యులు చుట్టుముట్టి ఆందోళన వ్యక్తంచేశారు. అయితే మధ్యాహ్నం తర్వాత బడ్జెట్‌పై చర్చను ప్రారంభించగలిగారు. రాత్రి 8 గంటల వరకు పలువురు సభ్యులు మాట్లాడారు. భాజపాయేతర పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన (యూబీటీ) సభ్యులు ఆరోపించారు. పన్నులు, ద్రవ్యోల్బణం ద్వారా పేదల్ని దోచుకుని కుబేరులకు మాత్రం రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. పుట్టుక నుంచి చావు వరకు ప్రతిదశలో వాడే వస్తువులపైనా పన్ను పడుతోందన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యాహ్నం మాట్లాడే అవకాశం ఉంది. చర్చను విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రారంభించాలని పలువురు విపక్షనేతలు కోరుకున్నా తాను అలాచేస్తే అధికారపక్షం 'కల్పిత అవాంతరాలతో' కీలకచర్చను పక్కదారి పట్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. బుధవారం ఆయన మాట్లాడే అవకాశం ఉంది.

రాహుల్‌ను, కాంగ్రెస్‌ను అభిశంసించాలి: భాజపా

స్పీకర్‌ను కాకుండా రాహుల్‌ను, కాంగ్రెస్‌ను అభిశంసించాల్సి ఉందని భాజపా పేర్కొంది. తమ 'అంతరాత్మ అభిశంసనకు' గురైనవారు రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న అందరినీ అభిశంసించాలంటున్నారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విలేకరుల సమావేశంలో చెప్పారు. అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్ ఒత్తిడి మేరకు రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్‌మిత్రపక్షాలు దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రధానికి సభలోనే హాని తలపెట్టేందుకు రాహుల్ ప్రోద్బలంతో ఘెరావ్ పేరిట ప్రయత్నాలు జరిగాయని చెప్పారు.

స్పీకర్‌ను కొనియాడుతూ భాజపా మహిళా ఎంపీల లేఖ!

మరోవైపు.. ఈ నెల 4న సభలో దుందుడుకుగా ప్రవర్తించిన ఎంపీలపై సాధ్యమైనంత కఠిన చర్యలు చేపట్టాలని భాజపా మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. తీవ్రమైన, అవాంఛిత పరిణామాలకు దారితీసి, ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలే పరిణామాలు తలెత్తవచ్చనే ఆందోళన కలుగుతోందని చెప్పారు. ఈ మేరకు ఒక లేఖ రాశారు. సభ హుందాతనాన్ని కాపాడటంలో స్పీకర్ అసాధారణంగా వ్యవహరించారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా నిష్పాక్షికంగా ఆయన అన్ని పార్టీలవారికీ అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు.

# స్పీకర్ తొలగింపా.. ఇంతవరకు చూడలేదు



స్పీకర్ తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటే నోటీసుపై కనీసం ఇద్దరు లోక్‌సభసభ్యులు సంతకం చేయాలి. సాధారణ ఆధిక్యంతో సభ ఆమోదిస్తే సరిపోతుంది. దీనికోసం సభలో ప్రస్తుతం ఉన్న సభ్యులందరినీ లెక్కిస్తారు. ఖాళీలు మినహాయించి మిగిలిన సభ్యులంతా లెక్కలోకి వస్తారని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పి.డి.టి.ఆచారి పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. "ఆరోపణలు నిర్దిష్టంగా ఉన్నాయా లేదా అనేది ప్రాథమిక దశలోనే చూస్తారు. ఎందుకంటే అవి కచ్చితంగా ఉన్నప్పుడే వాటిపై స్పీకర్ స్పందించగలరు. తనను తాను సమర్థించుకునేందుకు ఆయనకు అవకాశం ఉంది. నోటీసును ఉపసభాపతికి కాకుండా సెక్రటరీ జనరల్‌కే సమర్పించాలి. ప్రతిపాదిత తీర్మానంలో పరువుకు నష్టం కలిగించే భాష, ఇతర అంశాలు ఉండకూడదు. తీర్మానంలో వాడిన భాషను సాధారణంగా డిప్యూటీ స్పీకర్ పరిశీలిస్తారు. ప్రస్తుత లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకపోవడంతో ప్యానెల్ ఛైర్‌పర్సన్‌లలో అత్యంత సీనియర్ సభ్యుడు దీన్ని పరిశీలించే అవకాశం ఉంది'' అని వివరించారు.

14 రోజుల ముందు నోటీసులు

తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 14 రోజుల ముందే నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. తీర్మానం పరిగణనలో ఉన్న సమయంలో సభకు స్పీకర్ నేతృత్వం వహించే అవకాశం లేదు. తీర్మానాన్ని అనుమతించేందుకు 50 మంది సభ్యుల మద్దతు అవసరం. అన్నిపక్షాల నేతలతో మాట్లాడిన అనంతరం, నిబంధనలకు అనుగుణంగా తగిన సమయంలో చర్చకు తేదీని ప్రకటిస్తారు. తీర్మానం ప్రవేశపెట్టిన 10 రోజుల్లోగా దీనిపై చర్చించి తేల్చాల్సి ఉంటుంది. సభ ముందుకు ఇలాంటి మూడు తీర్మానాలు గతంలో వచ్చినప్పటికీ.. ప్రభుత్వానికి తగిన బలం ఉన్నందువల్ల ఇప్పటివరకు ఒక్కటి కూడా ఆమోదం పొందలేదు.

## లైంగిక దాడుల కేసుల్లో నిర్లక్ష్యపు వ్యాఖ్యల నియంత్రణకు చర్యలు




ఒక లైంగిక దాడికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు 2025 మార్చి 17న వెలువరించిన ఆదేశాలను పక్కన పెడుతున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఒక మైనర్ బాలిక వక్షస్థలాన్ని పట్టుకోవడం, ఆమె పైజామా బొందును ఊడదీయడం, నడుముకు కింది భాగంలో ఉండే వస్త్రాలను తొలగించడానికి ప్రయత్నించడం.. అత్యాచార ప్రయత్నం కిందకు రావని అలహాబాద్ హైకోర్టు నాటి ఆదేశాల్లో పేర్కొంది. ఆ ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం తనంత తానుగా విచారణ చేపట్టింది. లైంగిక దాడి కేసుల్లో మతిలేని నిర్లక్ష్య వ్యాఖ్యలు చేయడం బాధితులపై, వారి కుటుంబాలపై, సమాజంపై దారుణ ప్రభావం చూపుతుందని గత డిసెంబరులోనే సుప్రీం కోర్టు పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలపై మార్గనిర్దేశాల్ని నిర్ణయించే విషయంలో ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జాతీయ జ్యుడీషియల్ అకాడమీని కోరతామని ధర్మాసనం మంగళవారం పేర్కొంది. ఇలాంటి కేసుల్లో కోర్టులు.. వయసుకు తగిన భాషను వాడాలని కోరినట్లు వాదనలు వినిపించిన న్యాయవాది ఒకరు పేర్కొన్నారు. లైంగిక దాడి కేసుల్లో బాధితుల క్రాస్ ఎగ్జామినేషన్‌ని పూర్తి చేయని కేసులు ఎనిమిది నుంచి తొమ్మిదేళ్లుగా పెండింగులో ఉన్నాయని సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా తెలిపారు.

## నాటి పరికరాలతో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు



మంత్రిగా ఉద్యోగులతో సమీక్షలు జరుపుతానని, అలా వారితో ఫోన్‌లో మాట్లాడిన అంశాలు భారాస నాయకులకు తెలిశాయంటే.. తమ ఫోన్లను ఇప్పటికీ ట్యాపింగ్ చేస్తున్నట్టేనని పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 పురపాలికలు, ఏడు కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్ జరగనుందని, కాంగ్రెస్ పార్టీ 80 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు అసలు, వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి కుంటుపడకుండా పేదల అభ్యున్నతి, సంక్షేమం విషయంలో చెప్పిన మాటలన్నీ నెరవేర్చటంతోనే శాసనసభ ఉప ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తమ అభ్యర్థులను గెలిపించారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవబోతోందనే నిజాన్ని జీర్ణించుకోలేక భారాస నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని.. ఏప్రిల్ నుంచి రెండో విడత, తరువాత మూడో విడత ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఇటీవల సీపీఐ నేత నారాయణ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తాను సీఎం రేసులో లేనని, సామాన్య కార్యకర్తనేనని స్పష్టం చేశారు.

## రాజపత్రం సిద్ధం



పాత జీహెచ్ఎంసీలోని ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోన్లు పాక్షికంగా... విలీనమైన బోడుప్పల్, ఫీర్జాదిగూడ, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, తూముకుంట యూఎల్‌బీలతో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లు అయ్యాయి. వాటితో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ) ఏర్పడింది.

మునుపటి గ్రేటర్‌లోని ఖైరతాబాద్, చార్మినార్ జోన్లు.. సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లలోని కొన్ని ప్రాంతాలు.. బండ్లగూడజాగీర్, శంషాబాద్, జల్‌పల్లి, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయాంజాల్, మీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట యూఎల్‌బీలతో ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ, చార్మినార్, శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లు అయ్యాయి. వాటితో జీహెచ్ఎంసీ ఏర్పాటైంది. విమానాశ్రయం, రాష్ట్ర సచివాలయం, శాసనసభ, శాసనమండలి, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, సీఎం నివాసం, ఇతరత్రా ప్రముఖ భవనాలన్నీ జీహెచ్ఎంసీలోనే ఉన్నాయని, రాజధాని నగరంగా జీహెచ్ఎంసీ కొనసాగనుందని కమిషనర్ ఆర్వీ కర్ణణ్ తెలిపారు.

కార్పొరేషన్ల వారీగా శాసనసభ నియోజకవర్గాలు..

సీఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ పూర్తిగా, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, మేడ్చల్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు పాక్షికంగా.

జీహెచ్ఎంసీ పరిధిలో ముషీరాబాద్, మలక్‌పేట్, అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, బహదూర్‌పుర, సికింద్రాబాద్ పూర్తిగా, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా.

ఎంఎంసీ పరిధిలో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ పూర్తిగా, మేడ్చల్, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా.

మొత్తం టీసీయూఆర్ పరిధిలో.. 20 అసెంబ్లీ స్థానాలు పూర్తిగా, ఆరు నియోజకవర్గాల్లో కొంతభాగం.

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు .. కేంద్రం నుంచి కీలక ప్రకటన

బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.



# కొండాపూర్ జంగమోనికుంట కబ్జాపై హైడ్రా యాక్షన్

## రూ.700 కోట్ల విలువైన 4 ఎకరాల చెరువును కాపాడి ఫెన్సింగ్ వేసిన అధికారులు



చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న దృశ్యం




ఆక్రమణలను తొలగించి జంగమోనికుంటలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న హైడ్రా

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : చెరువును ఆక్రమించి.. మట్టితో చదును చేసి... ప్లాట్లను చేసి విక్రయించేందుకు సిద్ధం చేసిన వైనంపై హైడ్రా యాక్షన్ కు దిగింది. దాదాపు 700 కోట్ల రూపాయల విలువైన 4 ఎకరాల చెరువు భూమిని కాపాడి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కొండాపూర్ లోని జంగమోని కుంట చెరువు ఆక్రమణలను మంగళవారం తొలగించిన హైడ్రా అధికారులు చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...**

శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ మజీద్ బండలో సర్వే నెంబర్ 134లో జంగమోని కుంట చెరువు ఉంది. నాడు చుట్టు ప్రక్కల ప్రాంతాల భూములకు సాగునీటిని అందించిన ఈ చెరువు చుట్టూ కాలనీలు, నిర్మాణాలు పుట్టుకురావడంతో చెరువులోకి నీళ్లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది కబ్జాదారులు చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. చెరువు భూమిలో మట్టిపోసి చదును చేయడంతో పాటు ప్లాట్లు చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై గతంలోనే రెవెన్యూ అధికారులు కబ్జాదారుల మీద క్రిమినల్ కేసులు సైతం నమోదు చేశారు. కానీ చెరువు భూమి ఆక్రమణపై వెనక్కు తగ్గని కబ్జాదారులు తాజాగా మరోసారి మట్టినింపి చదును చేయసాగారు. ఈ విషయాన్ని స్థానికులు హైడ్రాకు పిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహించారు. దాదాపు 4 ఎకరాల జంగమోని కుంట చెరువును ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్న హైడ్రా అధికారులు మంగళ వారం యాక్షన్ కు దిగింది. చెరువు భూమిలో పాక్షికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను నేలమట్టం చేసి 4 ఎకరాల చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు సదరు స్థలం జంగమోని కుంట చెరువు అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. మరోసారి చెరువు భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తే కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యధిక నిధులు గచ్చిబౌలికి

## కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్పొరేటర్ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న గంగాధర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఐదేళ్లలో రూ.920 కోట్లతో గచ్చిబౌలిలో అభివృద్ధి పనులు..**

ఈకబురు, శేరిలింగంపల్లి : గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యధిక నిధులను గచ్చిబౌలి డివిజన్ కు తీసుకువచ్చి భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని, గత ఐదేళ్ల కాలంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలో దాదాపు 920 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. కార్పొరేటర్ గా ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి వార్డు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల క్రితం నాటి ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ నుంచి శేరిలింగంపల్లిలో ఏకైక కార్పొరేటర్ గా గెలిచిన తాను అందరి సహకారంతో డివిజన్ ను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని అన్నారు. తనకు ఎంతో ఇష్టమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి జోనల్ , సర్కిల్ అధికారుల అండతో అత్యధిక నిధులను డివిజన్ కు తీసుకువచ్చి 90 శాతం పనులు పూర్తి చేసినట్టు తెలిపారు.నేతాజీ నగర్, గుల్మోహర్ పార్క్, నల్లగండ్ల విలేజ్, నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీ, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా, ఎన్టీఆర్ నగర్, సోఫా కాలనీ, తాజ్ నగర్, గౌలిదొడ్డి, కేశవ్ నగర్, నానక్‌రామ్ గూడ, ఖాజా గూడ, ప్రశాంత్ హిల్స్, మధురా నగర్, రాయదుర్గం, గచ్చిబౌలి, టెలికం నగర్, జీపీఆర్ఏ క్వార్టర్స్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, సెంట్రల్ లైటింగ్ వంటి మౌలిక వసతుల పనులు విస్తృతంగా చేపట్టి పూర్తి చేశామన్నారు. డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల అభివృద్ధి స్కూల్స్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, ప్రహరీ గోడల నిర్మాణం ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కొత్తగా ఫ్లై ఓవర్లు సైతం అందుబాటులోకి వచ్చాయన్నారు. ఖాజాగుడ స్టేడియం సమస్యతో పాటు డంపింగ్ యార్డును షిఫ్ట్ చేయాల్సి ఉందన్నారు. ఈ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరలోనే పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే నిలబడతానని, భవిష్యత్తులో సైతం గచ్చిబౌలి డివిజన్‌ను మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు.

# ఏసిబికి చిక్కిన మాదాపూర్ ఎస్ఐ వినయ్

**రూ.50వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన వైనం**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలో మరో అవినీతి తిమింగళం లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు చిక్కింది. నోటీసులు ఇచ్చేందుకు ఓ వ్యక్తి నుంచి లక్ష రూపాయలు డిమాండ్ చేసి, 50వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసిబీ అధికారులు మాదాపూర్ సబ్ ఇనిస్పెక్టర్ వినయ్ ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...**

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో ఫైనాన్షియల్ కన్సల్టెన్సీకి చెందిన వ్యక్తి మీద మాదాపూర్ పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ పిర్యాదుపై మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్స్‌పెక్టర్ వినయ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా సదరు కేసుపై ఫైనాన్షియల్ కన్సల్టెన్సీ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చి విచారించాలని ఆదేశించింది. ఈ విషయమై నోటీసులు ఇచ్చేందుకు ఎస్ఐ వినయ్ ఫైనాన్షియల్ కన్సల్టెన్సీ వ్యక్తి వద్ద లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశాడు. అంత డబ్బు తాను ఇవ్వలేనని సదరు వ్యక్తి చెప్పడంతో రెండు దఫాలుగా లక్ష రూపాయలు ఇవ్వాలని ఎస్ఐ వినయ్ సూచించాడు. దీంతో బాధితుడు ఏసిబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం బాధితుడు 50వేల రూపాయల లంచం డబ్బును మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ వినయ్ కి అందజేస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఎస్ఐ వినయ్ సెక్షన్ లో విచారించిన అనంతరం ఏసిబి అధికారులు ఏసిబి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కు తరలించారు.



మాదాపూర్ ఎస్ఐ వినయ్

# తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష



**అన్ని కేంద్ర పథకాలతో కలిపి కేవలం రూ.51 వేల కోట్లు మాత్రమే తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలపై భారీగా ఖర్చు చేస్తోందని, ఈ పరిస్థితుల్లో కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాకోసం కేంద్రంతో పోరాటానికి తమతో కలిసి రావాలని కోరారు. మంగళవారం తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడారు.**

కేంద్రంపై ఆధారపడేలా చేయాలనే వ్యూహం జీఎస్టీ సవరణల కారణంగా రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోంది. మరోవైపు రంగాల వారీగా రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కోత పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటోంది. బలమైన రాష్ట్రాలను బలహీనపరిచి, ఆర్థికంగా తమపై ఆధారపడేలా చేయాలనే రాజకీయ ఉద్దేశం ఇందులో ఉన్నట్లు కనిపిస్తోంది. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగినప్పుడే..దేశం సమగ్రాభివృద్ధి సాధించడం, వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందనే సత్యాన్ని గుర్తెరగాలి. భాజపా ఎంపీలు అన్యాయాన్ని ప్రశ్నించరేం? తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే ఇద్దరు కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడూ ప్రశ్నించకపోగా.. రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. జాతీయ రహదారుల నిర్మాణాలకు వెచ్చించే సొమ్మును కూడా రాష్ట్రానికి విడుదలచేసే నిధులుగా చూపుతూ భాజపా నేతలు గొప్పలు చెబుతున్నారు. ఆ రహదారుల నిర్మాణ ఖర్చును టోల్‌ఛార్జీల రూపంలో మళ్లీ ప్రజల నుంచే వసూలు చేస్తారనే విషయాన్ని వాళ్లు విస్మరిస్తున్నారు' అని తుమ్మల ధ్వజమెత్తారు.

**వసూలు చేసేది రూపాయి.. తిరిగి ఇచ్చేది 30 పైసలు**

"201819, 202223 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పన్నుల రూపంలో రూ.90.80 లక్షల కోట్లు వసూలు చేసింది. అందులో దక్షిణాది రాష్ట్రాల వాటా రూ.22.86 లక్షల కోట్లుకాగా..ఆయా రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చింది కేవలం 16.3 శాతం మాత్రమే. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో వసూలుచేసిన రూపాయికి.. సగటున 30 పైసలే తిరిగి ఇస్తోంది. ఇదే సమయంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూపాయికి..రూ.4 చొప్పున తిరిగి ఇస్తోంది. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారింది. ఉదాహరణకు 202425 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.1,33,208 కోట్లు పన్నుల రూపంలో కేంద్ర ఖజానాకు వెళ్లగా..కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.27,050 కోట్లు, గ్రాంట్ల రూపంలో రూ.7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.16,762 కోట్ల చొప్పున మొత్తంగా రూ.51,725 కోట్లు వచ్చాయి. ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి స్వయంగా వెల్లడించారు"

# నా పేరును మార్చడానికి మీరెవరు?

## ..రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం



- **మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం**
- **అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా**
- **అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత**

ఈ కబురు ; మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

# గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద..

## ఈక్విటీలతో సమానంగా




ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో నికరంగా రూ.24,028 కోట్లు మాత్రమే వచ్చాయి. అంతకుముందు నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 14 శాతం తగ్గుముఖం పట్టింది. ఈక్విటీల్లోకి పెట్టుబడులు తగ్గడం వరుసగా రెండో నెల. మార్కెట్ పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడం ఇందుకు కారణం. అదే సమయంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి (Gold ETF) భారీగా పెట్టుబడులు తరలిరావడం విశేషం. ఈ మేరకు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ (AMFI) జనవరి నెలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. యాంఫీ డేటా ప్రకారం.. మ్యూచువల్ ఫండ్ల సంస్థల (ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ పెరిగింది. డిసెంబర్‌లో రూ.80.23 లక్షల కోట్లుగా ఉన్న ఈ విలువ రూ.81.01 లక్షల కోట్లకు చేరింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ నుంచి డిసెంబర్‌లో రూ.66,591 కోట్ల నిధులు తరలిపోగా.. జనవరి నెలలో వివిధ కేటగిరీల్లో నికరంగా రూ.1.56 లక్షల కోట్ల నిధులు వచ్చాయి. ఈక్విటీ స్కీమ్స్‌లో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.7,672 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,185 కోట్లు, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,182 కోట్లు చొప్పున నిధులను ఆకర్షించాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,005 కోట్లు రాగా.. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,942 కోట్లు నిధులొచ్చాయి. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ (ELSS) నుంచి రూ.593.69 కోట్లు తరలిపోయాయి. మదుపర్ల నుంచి ప్రాఫిట్ బుకింగ్, ట్యాక్స్ సంబంధిత అడ్జెస్ట్‌మెంట్ల వల్ల ఈ పరిస్థితి నెలకొందని యాంఫీ పేర్కొంది. ఇదే నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.74,827 కోట్ల నిధులు వచ్చాయని తెలిపింది. గోల్డ్ రష్: బంగారం ధరల్లో భారీ పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు భారీగా తరలివచ్చాయి. డిసెంబర్ నెలలో రూ.11,647 కోట్ల పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రాగా.. జనవరిలో రూ.24,040 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అంటే నెలవారీగా చూసినప్పుడు నిధులు రెట్టింపయ్యాయి. దాదాపు ఈక్విటీ పెట్టుబడులతో సమానంగా ఈ కేటగిరీలోకి నిధులు తరలివచ్చాయి.

## వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాల నేపథ్యంలో వరుసగా మూడో రోజూ సూచీలు లాభపడ్డాయి. కొన్ని కంపెనీలు మెరుగైన త్రైమాసిక ప్రకటించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. సెన్సెక్స్ 200 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 25,900 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 84,210 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,065.75) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,482.95 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 208.17 పాయింట్ల లాభంతో 84,273.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67.85 పాయింట్ల లాభంతో 25,935.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.

## అరబిందో ఫార్మా లాభం రూ.910 కోట్లు




ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 202526 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 7.6 శాతం వృద్ధితో రూ.910.29 కోట్లకు చేరింది. 202425 మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.845.81 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.7,978.52 కోట్ల నుంచి 8.4 శాతం వృద్ధితో రూ.8,646 కోట్లకు చేరింది. ఐరోపా మార్కెట్, యాంటీ రెట్రోవైరల్ విభాగాల్లో విక్రయాలు ఈ వృద్ధికి దోహదం చేశాయి. అమెరికా మార్కెట్‌లో రూ.3,729 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 9 ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. ఐరోపా ఆదాయం 27.4 శాతం పెరిగి, రూ.2,703 కోట్లకు చేరింది. ఏపీఐ వ్యాపారం 4.3 శాతం క్షీణించి, రూ.963 కోట్లకు పరిమితమైంది. విద్యుత్ ఖర్చుల ఆదాలో భాగంగా గరుడ రెన్యూవబుల్స్‌లో రూ.66 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా తన అనుబంధ సంస్థ ఆరో వ్యాక్సిన్స్‌ను మరో అనుబంధ సంస్థ క్యూరేటెక్ బయోలాజిక్స్‌తో విలీనం చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా పునీతా కుమార్ సిన్హాను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 'మా ప్రధాన మార్కెట్లైన అమెరికా, ఐరోపాలలో గిరాకీ నిలకడగా ఉంది. దీంతో ఈ త్రైమాసికంలో స్థిరమైన పనితీరు కనిపించింది. భవిష్యత్తులోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాం' అని సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానంద రెడ్డి వెల్లడించారు.

## పెరిగిన అపోలో మైక్రో సిస్టమ్స్ లాభం

రక్షణ రంగంలోని అపోలో మైక్రో సిస్టమ్స్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలో అత్యధికంగా రూ.252.22 కోట్ల ఆదాయంపై రూ.22.88 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.148.39 కోట్లు, నికర లాభం రూ.18.24 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 70%, నికర లాభం 25% వరకూ పెరిగాయి. 9 నెలల కాలానికి రూ.611 కోట్ల ఆదాయం, రూ.70.59 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఫలితాల సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి స్పందిస్తూ.. ఆర్డర్ బుక్‌ను సమర్థంగా అమలు చేయడం, అనేక హైవాల్యూ సిస్టమ్స్ ఉత్పత్తి దశకు చేరుకోవడం వల్లే ఈ రికార్డు స్థాయి ఆదాయం సాధ్యమయ్యిందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 4550 శాతం వరకూ వృద్ధిని సాధిస్తామని పేర్కొన్నారు.

# 'సాఫ్ట్‌వేర్'కు ఇబ్బందేమీ లేదు..


**–ఏఐ టూల్స్ వల్ల ఉత్పాదకత పెరుగుతుంది**
**–ఆవిష్కరణలు వేగవంతమవుతాయ్**
**–నూతన ఉత్పత్తులకు నిపుణులు కావాల్సిందే**

సాఫ్ట్‌వేర్‌తో పాటు సాఫ్ట్‌వేర్ టూల్స్‌కు కృత్రిమమేధ (ఏఐ) సాంకేతికత, దాని ఆధారిత అధునాతన టూల్స్ ప్రత్యామ్నాయంగా మారతాయన్న అంచనాలు అంతర్జాతీయంగా పెరుగుతున్నాయి. ఐటీ కంపెనీల భవితకు పెను ముప్పు ముంచుకొస్తోందని, వాటిల్లో పనిచేసే లక్షల మంది నిపుణులకు పని లేకుండా పోతుందనే ఆందోళనలూ రేగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లు మరింత ఎక్కువగా స్పందిస్తున్నందున, ఐటీ కంపెనీల షేర్లు నష్టపోతున్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌కు వచ్చిన ఇబ్బందేమీ ఉండదనే భరోసాను గూగుల్, ఎన్‌విడియా వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల సీఈఓలతో పాటు.. ప్రస్తుత ఆందోళనకు కారణమైన ఆంథ్రోపిక్ సంస్థ సహ వ్యవస్థాపకురాలే స్వయంగా విశదీకరిస్తున్నారు.

**ఇదీ నేపథ్యం..** 'వివిధ రంగాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ నిపుణులు చేసే పనులను' తమ అధునాతన క్లాడ్ కోవర్క్ ప్లాట్‌ఫామ్ స్వతంత్రంగా చేయగలదని అమెరికాకు చెందిన ఏఐ డెవలపర్ సంస్థ ఆంథ్రోపిక్ ప్రకటించడం, ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంపై అమిత ప్రభావం చూపింది. 2030 కల్లా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభస్థాయి ఉద్యోగాలను సగం వరకు ఏఐతో భర్తీ చేయొచ్చని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొనడం సంచలనమైంది. ఇప్పటికే వినియోగిస్తున్న ఏఐ టూల్స్ కేవలం ఇచ్చిన డేటా నుంచి కావాల్సిన సమాధానాన్ని ఇవ్వడం, క్రమపద్ధతిలో అమర్చడం వంటివి చేస్తున్నాయి. అయితే ఆంథ్రోపిక్ టూల్ మాత్రం కావాల్సిన సమాచారాన్ని కూడా అదే ఎంచుకుని, పనిని పూర్తి చేస్తుందని ప్రకటన వచ్చింది.

**దిగ్గజాల భరోసా...** చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఎన్‌విడియా సీఈఓ జెన్సన్ హాంగ్ మాత్రం సాఫ్ట్‌వేర్‌కు ఏఐ ప్రత్యామ్నాయం అవుతుందనే వాదనను తోసిపుచ్చుతున్నారు. ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ఆధారితంగానే ఏఐ పనిచేస్తుందని సిస్కో సిస్టమ్స్ నిర్వహించిన సదస్సులో జెన్సన్ వివరించారు. జనరల్ ఆర్టిఫిషియల్ రోబో అయినా ఉన్న టూల్స్ వినియోగిస్తుందే కానీ, కొత్త టూల్స్ కనిపెట్టదని ఆయన పేర్కొన్నారు.

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ నిపుణుల ఉత్పాదకత పెరుగుతుందని, వారు మరింత ప్రభావవంతంగా పని చేసేందుకు ఉపకరిస్తాయని చెబుతున్నారు. ఒకే తరహా పనులను మళ్లీమళ్లీ చేయాల్సిన అవసరం లేకుండా, ఆటోమేట్ చేయడానికి ఏఐ ఉపయోగ పడుతుందని బ్లూమ్‌బర్గ్ టెక్ సమావేశంలో పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆటోమేషన్ వల్ల ఉద్యోగులు అవసరం ఉండకుండా పోవచ్చనే వాదనలు గత 20 ఏళ్లుగా వినిపిస్తూనే ఉన్నాయని.. అయితే ఏటా కొత్త ఉద్యోగాలు టెక్నాలజీ రంగంలో వస్తూనే ఉన్నాయని సుందర్ పిచాయ్ గుర్తు చేశారు. గూగుల్ కోడ్‌లో 30% ఏఐ నుంచే జరుగుతోందని, కొత్త ఉత్పత్తి ఆవిష్కరణను ఏఐ వేగవంతం చేస్తోందని సుందర్ పిచాయ్ వివరించారు. కొత్త ఉత్పత్తి కోసం మరింత మంది ఉద్యోగులు కావాల్సి వస్తారని విశ్లేషించారు. మనిషితో సమానంగా/అంతకంటే మెరుగ్గా కార్యకలాపాలను నిర్వహించే ఏఐ వ్యవస్థ అయిన ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) సాకారం చేయొచ్చా అన్న ప్రశ్నకు 'ఇప్పటివరకు దీనిపై ఎవరికీ స్పష్టత ఉందని నేననుకోను' అని సుందర్ పిచాయ్ బదులిచ్చారు.




**కోడింగ్‌కు ప్రాధాన్యం తగ్గుతోంది.. ఉద్యోగులకు కాదు.....** ఏఐ టూల్స్ అంతకంతకూ సమర్థంగా మారుతున్నందున, కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గుతోందని.. అయితే ఉద్యోగులకు కాదని ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకురాలు డేనియల అమోడెయ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సాహిత్యం చదివిన ఆమె, తదుపరి ఓపెన్‌ఏఐలో పనిచేసి, తదుపరి తన సోదరుడితో కలిసి ఆంథ్రోపిక్‌ను ప్రారంభించారు. ఏఐ కంపెనీలు ఎలాంటి ఉద్యోగులను నియమించుకుంటాయో ఆమె వివరించారు. పూర్తిగా టెక్నాలజీ నైపుణ్యాలున్న వారి కంటే కమ్యూనికేషన్, కల్పనాశక్తి కలిగినవారికి, కొత్తవాటిపై అమితాసక్తి కనబరచేవారికి ఏఐ కంపెనీలు నియామకాల్లో ప్రాధాన్యమిస్తాయని వివరించారు. ఉద్యోగులను ఏఐ భర్తీ చేయనుందంటూ వచ్చిన వార్తలు పూర్తిగా అతిశయోక్తితో కూడుకున్నవని స్పష్టం చేశారు. 'మనుషుల ప్రమేయం లేకుండా, పూర్తిగా ఏఐ చేయగల పనులు అత్యంత స్వల్పం' అని ఆమె స్పష్టం చేశారు. మేము కూడా ఆంథ్రోపిక్ కోసం ఉద్యోగులను నియమించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కమ్యూనికేషన్స్ సామర్థ్యాలు కలిగిన వారిని, భావోద్వేగాలను అర్థం చేసుకుని, ఉపయోగించగలిగిన వారిని, ఇతరుల పట్ల సానుకూల/దయార్ద్ర హృదయంతో స్పందించే వారికి ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణులు, ఏఐ కలిస్తే మరింత మెరుగైన ఉత్పాదకత లభిస్తుందని వివరించారు. కఠిన సవాళ్లను, ఆసక్తికర ఆవిష్కరణలను సాధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

# విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు

గత రెండేళ్లలో పలు నిబంధనల ఉల్లంఘన కారణంగా వాణిజ్య విమానయాన సంస్థలకు మొత్తంగా 352 షోకాజ్ నోటీసులను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసింది. 2024 జనవరి 1 నుంచి 2025 డిసెంబరు 31 వరకు ఇండిగోకు 98, ఎయిరిండియాకు 84 షోకాజ్ నోటీసులు వచ్చాయని రాజ్యసభకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమర్పించిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు 65, స్పైస్‌జెట్‌కు 45, ఆకాశ ఎయిర్‌కు 17, అలయన్స్ ఎయిర్‌కు 23, ఫ్లై బిగ్‌కు 12, ఏఐఎక్స్ కనెక్ట్‌కు 8, స్టార్ ఎయిర్‌కు ఒకటి చొప్పున షోకాజ్ నోటీసులు అందాయి. అయితే వీటిల్లో ఏఐఎక్స్ కనెక్ట్ ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో విలీనం అయ్యింది. ఈ 352 షోకాజ్ నోటీసుల్లో 139 నోటీసులకు సంబంధించి విమానయాన సంస్థలకు జరిమానా విధించారు.

మరో 113 షోకాజ్ నోటీసుల వ్యవహారంలో విమానయాన సంస్థలకు డీజీసీఏ హెచ్చరిక ఆదేశాలను జారీ చేసింది. కేవలం 7 నోటీసుల విషయంలో సంతృప్తికర వివరణ అందినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. 202425లో భారత విమానయాన సంస్థల మొత్తం నష్టం రూ.5,289.73 కోట్లుగా నమోదైందని రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా గ్రూపు ఒక్కటే రూ.9,808.12 కోట్ల నష్టాన్ని చవిచూసిందని వెల్లడించారు. ఇందులో ఎయిరిండియా నష్టం రూ.3,975.75 కోట్లు కాగా.. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నష్టం రూ.5,832,37 కోట్లు. అలాగే ఆకాశ ఎయిర్ రూ.1,986.25 కోట్ల నష్టాన్ని నమోదుచేసింది. మొత్తం 11 విమానయాన సంస్థల్లో నాలుగే ఇండిగో, బ్లూ డార్ట్, స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్ లాభాలను నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో కంపెనీల చట్టం నిబంధనల ఉల్లంఘనకు గాను 703 కంపెనీలపై మొత్తంగా రూ.55 కోట్ల జరిమానా విధించినట్లు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. ఇందులో రూ.7.51 కోట్లే వసూలైనట్లు వెల్లడించారు. ధరల పెంపు విషయంలో ఉక్కు తయారీ సంస్థలు కుమ్మక్కయ్యాయనే ఆరోపణల వ్యవహారంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తు నిర్వహిస్తోందని ప్రభుత్వం తెలిపింది. అలాగే యాంటీ కాంపిటీటివ్ విధానాల కింద 54 కేసులు నమోదయ్యాయని, 149 విలీన దరఖాస్తులు వచ్చాయని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.




# భారత్‌కు 74 రోజుల చమురు నిల్వలు..

# మరి వాటిని ఎక్కడ స్టోర్ చేస్తారో తెలుసా..?

అంతర్జాతీయంగా భౌగోళికరాజకీయ అనిశ్చితులతో ఎదురయ్యే ఆకస్మిక పరిస్థితులకు తగ్గట్టుగా ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి. ప్రస్తుతం ఇరాన్‌అమెరికా ఉద్రిక్తత వేళ ముడిచమురు సరఫరాకు ఏమైనా అంతరాయం కలుగుతుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారత్ వ్యూహాత్మక చమురు నిల్వలపై కేంద్రం స్పందించింది. 74 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. అయితే వాటిని ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థల నిబంధనల ప్రకారం 90 రోజుల నిల్వలు ఉండాలి. ఆ లక్ష్యంగా దిశగా భారత్ చర్యలు చేపడుతోందని మంత్రి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఏవైనా యుద్ధం, ఆంక్షలు వంటి భారీ అంతరాయాలు ఏర్పడితే.. ఆ అత్యవసర సమయంలో వ్యూహాత్మక నిల్వలు కీలకంగా మారతాయి. మరి ఆ చమురును ఎక్కడ స్టోర్ చేస్తారో తెలుసా..? భూగర్భంలో ఇంజినీరింగ్ నైపుణ్యాలతో తవ్విన గుహలలో ఆ ఆయిల్‌ను నిల్వచేస్తారు. అలాంటివి విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్), మంగళూరు (కర్ణాటక), పదూర్ (కర్ణాటక)లో ఉన్నాయి. వాటి సామర్థ్యం దాదాపు 5.33 మిలియన్ల టన్నులు. చాందిఖోల్ (ఒడిశా), పదూర్ (సామర్థ్యం పెంపు) నిల్వకేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. బికనేర్ (రాజస్థాన్), బినా (మధ్యప్రదేశ్)లో కొత్త కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ స్టోరేజ్ సైట్స్ అన్నీ సహజమైనవి కావు. అవి ప్రత్యేకంగా నిర్మించిన భూగర్భరాతి గుహలు. వాటిని అధునాతన టన్నెలింగ్, బ్లాస్టింగ్ టెక్నిక్స్‌తో తీర్చిదిద్దారు. దశాబ్దాల పాటు చమురు నిల్వ (oil Reserves) చేసేందుకు వాటిని నిర్మించారు.

భూ ఉపరితల ట్యాంకుల్లో చమురు నిల్వ చేయడం కంటే.. ఈ గుహలను ఉపయోగించడం చౌకైనది. సురక్షితం కూడా. అగ్ని ప్రమాదాలు, వైమానిక దాడులు, ప్రకృతి విపత్తుల నుంచి అవి తట్టుకోవడమేగాకుండా.. చమురు బాష్పీభవనాన్ని పరిమితం చేస్తాయి. ఈ గుహలు లీకేజీ, కాలుష్యాన్ని నివారించేలా వాటిని తీర్చిదిద్దారు. వీటిని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఇది కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆయిల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ బోర్డ్ యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఇది .



# భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధిస్తే.. పీయూష్ గోయల్

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, యూఎస్ఏ మ్యాచ్‌కు సుంకాలను ముడిపెడుతూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. క్రికెట్ మ్యాచ్ గెలిచేదని అన్నారు. భారత్‌అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (FTA) అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. భారత్ ఉత్పత్తులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ డీల్ నేపథ్యంలో భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇచ్చిన విందుకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఎస్ఏ టీమ్‌కు విజయం దక్కకపోయినా.. ఆట తీరు అద్భుతం. క్రికెట్ గురించి పెద్దగా తెలియకపోయినా.. కొన్నేళ్ల క్రితమే ఆటను మొదలుపెట్టిన ఈ జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. సెర్గియో ఈ గేమ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. 18 శాతం సుంకాలు విధించకపోయి ఉంటే.. గెలిచి ఉండేవాళ్లమని అప్పుడు సెర్గియో అనుకొని ఉంటారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక సూచన చేస్తున్నాను. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. మీ టీమ్ మ్యాచ్ గెలిచి ఉండేది. ఏదేమైనప్పటికీ.. అమెరికా జట్టు ప్రదర్శన చూసి నేను ఆశ్చర్యపోయాను" అని గోర్‌ను ఉద్దేశించి మంత్రి అన్నారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా శనివారం రాత్రి భారత్, యూఎస్ఏ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌తో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. ముంబయి వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరివరకు పోరాడినా యూఎస్ఏ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. యూఎస్ఏ జట్టు ఆటతీరుకు ప్రశంసలు దక్కాయి.



## సోషియో ఫాంటసీ కథతో సుమంత్ ‘మహేంద్రగిరి వారాహి’ ..విడుదలకు సిద్ధం



సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘మహేంద్రగిరి వారాహి’. రాజశ్యామల బ్యానర్‌పై మధు కాలిపు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి చిత్ర బృందం వీడియోను విడుదల చేసింది. సుమంత్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ స్పెషల్ గ్లింప్స్‌ను పంచుకుంది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో సూపర్ నేచురల్ కథతో వస్తోన్న ‘మహేంద్ర గిరి వారాహి’ కోసం ఒక విభిన్నమైన, సరికొత్త పాత్రను హీరో సుమంత్ కోసం దర్శకుడు సంతోష్ జాగర్లపూడి డిజైన్ చేశారని చిత్ర బృందం చెబుతోంది. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశంతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

## గుర్తుపట్టలేని రోల్‌లో రాధిక.. మేకప్ తీయడానికే 2 గంటలట



నాలుగు దశాబ్దాల నట ప్రస్థానం రాధికా శరత్‌కుమార్‌ది). ఇన్నేళ్లలో ఎన్నో వైవిధ్య పాత్రలు పోషించిన ఆమె.. ఇటీవల మరో కొత్త రోల్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ‘తాయ్ కిళవి’ సినిమాలోని ఓ కీ రోల్ కోసం ఆహార్యాన్ని పూర్తిగా మార్చుకున్నారు. తీక్షణంగా చూస్తేనేగానీ ఆమెను గుర్తుపట్టలేం. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ పాత్ర గురించి ఆసక్తికర విషయం పంచుకున్నారు రాధిక. ఈ న్యూ లుక్ కోసం నటుడు కమల్‌హాసన్ నుంచి సలహాలు తీసుకున్నానని తెలిపారు. రోజూ మేకప్ వేసుకునేందుకు 5 గంటలు, దానిని తీసేందుకు 2 గంటల సమయం పట్టేదని చెప్పారు. ఈ సినిమా, అందులోని పాత్ర పోషించేందుకు ముందుగా తాను ఆసక్తి చూపలేదని అన్నారు. తనకు ఇష్టం లేదని చెప్పినా.. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దాదాపు రెండేళ్లపాటు తిరిగారని పేర్కొన్నారు. తన భర్త, నటుడు శరత్‌కుమార్ సూచనతో నటించానని చెప్పారు. ఈ తమిళ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది.

## ‘దృశ్యం 3’ క్లైమాక్స్.. ప్రతి ఒక్కరూ షాక్ అవ్వాల్సిందేనట!




‘దృశ్యం’ క్లైమాక్స్ ట్విస్ట్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. దానికి కొనసాగింపుగా వచ్చిన ‘దృశ్యం 2’ ట్విస్ట్ గురించి అయితే మాటల్లో చెప్పాల్సిన పనిలేదు. అంతలా రెండు చిత్రాలు థ్రిల్ పంచాయి. వీటికి మించిన ఉత్కంఠను, థ్రిల్‌ను ‘దృశ్యం 3’ క్లైమాక్స్ ఇస్తుందట. ఈ విషయాన్ని చెప్పింది ఎవరో కాదు, నటి ఆశా శరత్. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా, కొడుకుని కోల్పోయిన తల్లిగా ఆమె నటించి మెప్పించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మూడో భాగం గురించి మాట్లాడారు. ‘దృశ్యం 3’ క్లైమాక్స్ చూసి స్టన్ అయిపోతారు. అది నిజమా? అని ఆశ్చర్యపోతారు. ప్రేక్షకులను కుర్చీ అంచున కూర్చోబెట్టే మరో సినిమా ఇది’’ అని పేర్కొన్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మలయాళ ‘దృశ్యం 3’ ఏప్రిల్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే ఈ విషయాన్ని ప్రకటిస్తూ చిత్ర బృందం వీడియోను కూడా పంచుకుంది. మోహన్‌లాల్ హీరోగా జీతూ జోసెఫ్ దీనిని తెరకెక్కిస్తున్నారు. అనుకోకుండా హత్య జరగడం, దాన్నుంచి బయటపడేందుకు ఓ కుటుంబం చేసే ప్రయత్నాలే ఈ సినిమాల కథాంశాలు. మలయాళంలో రూపొందిన ఈ హిట్ ఫ్రాంచైజీ తర్వాత తెలుగు, తమిళం, హిందీలోనూ రీమేక్ అయిన సంగతి తెలిసిందే. మరోవైపు, కథానాయకుడు వెంకటేశ్ కూడా ‘దృశ్యం 3’ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో నటిస్తున్న ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 (AK47) పూర్తయిన వెంటనే మూడో భాగం కోసం రంగంలోకి దిగుతారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ ‘దృశ్యం 3’తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముంది.

## అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు బయలుదేరిన బండ్ల గణేష్

సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ షాద్‌నగర్ నుంచి తిరుమలకు చేపట్టిన సంకల్పయాత్ర అలిపిరి వద్దకు చేరింది. మంగళవారం ఉదయం అలిపిరి వద్ద ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి, పాదాల మండపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని బండ్ల గణేష్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నట్లు బండ్ల గణేష్ తెలిపారు.



# అల్లు అర్జున్‌తో యాడ్ షూట్.. ఆ నిబంధనలు పాటించాలట!

ఒకవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు వివిధ ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా వ్యవహరిస్తుంటారు సినీ నటులు. ప్రకటనల చిత్రీకరణ సమయంలో సినీ నటుల వ్యక్తిగత సిబ్బంది కచ్చితమైన నిబంధనలు పాటిస్తారని అంటున్నారు బ్రాండ్ స్ట్రాటజర్ కావేరీ బారువా. ఇక అగ్ర కథానాయకులైతే ఆ నిబంధనలు మరింత కఠినంగా ఉంటాయన్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అల్లు అర్జున్‌లాంటి కథానాయకుడితో యాడ్ షూటింగ్ అంటే, కచ్చితమైన ప్రోటోకాల్ ఉంటుందని, ఆయన్ను కలిసిన తర్వాత ఏం చేయాలి? ఏం చేయకూడదన్న నిబంధనలు ముందే చెబుతారని అన్నారు. ‘‘ఇంతియాజ్‌లాంటి వారితో చేయడం చాలా సులభంగా ఉంటుంది. ఆయన సెలబ్రిటీ అని అస్సలు భావించరు. షూటింగ్‌లో 50 మంది ఉంటే, ఆ యాడ్ షూట్ పూర్తయ్యే సరికి అందరినీ గుర్తుపట్టి మాట్లాడేస్తుంటారు. ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడతారు. ఇక బాబీ దేఓల్ సర్ ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడతారు. అయితే, ఆయన రావడం.. పని చేసుకోవడం వెళ్లిపోవడం. హంగామా అస్సలు ఉండదు. ఇంతియాజ్‌లా సెట్‌లో ఎవరికీతోనూ కలవరు. ఒక్కొక్కరికీ ఒక్కో విధమైన వ్యక్తిత్వం ఉంటుంది. అలాగే, అల్లు అర్జున్‌తో మరో రకమైన అనుభవం నేను ఎదుర్కొన్నా. ఆయనతో ఒక యాడ్ షూట్ చేశాం. దక్షిణాది నటులను కలిసే విషయంలో ఒక పద్ధతి ఉంటుంది. అల్లు అర్జున్‌ను కలవడానికి ముందు ఏం చేయాలి? ఏం చేయకూడదు 42 నిబంధనలు ఉంటాయి. ఈ విషయంలో మేనేజర్లు చాలా కఠినంగా ఉంటారు’’ ....‘‘హీరోకు షేక్ హ్యాండ్ ఇవ్వొద్దు. తగిన దూరం పాటించాలి. హీరో సెట్‌లో ఉండగా ఫోన్ వినియోగించకూడదు’ ఇలా చెబుతారు ఆ యాడ్ షూటింగ్ సమయంలో అల్లు అర్జున్ వస్తుండగా సెట్‌లో ఎక్కడో చివర ఫోన్ చూసుకుంటూ కూర్చొన్నా. అంతే, ఆయన బాడీగార్డ్ ఒక్క ఉదుటున నా దగ్గరకు వచ్చి, చేతిలో ఫోన్‌లాగేసుకుని ‘ఇక్కడ ఫోన్ అనుమతి లేదు’ అన్నాడు. కానీ, అది నా పని. బహుశా హీరో ప్రైవసీకి భంగం కలగకూడదని అలా కఠినంగా ఉండవచ్చు’’ అని కావేరీ బారువా అభిప్రాయం వ్యక్తం చేశారు.





## అందుకే మా సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ ..‘కపుల్ ఫ్రెండ్లీ’ నిర్మాత

ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న విడుదల కానున్న చిత్రాల్లో ‘కపుల్ ఫ్రెండ్లీ’ ఒకటి. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. టైటిల్ విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తెలిపారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ‘‘కపుల్ ఫ్రెండ్లీ.. అసభ్యకరంగా అనిపిస్తోందని చెప్పిన సెన్సార్ బోర్డు సినిమా పేరును మార్చమని సూచించింది. ‘ఫ్రెండ్లీ కపుల్’ పేరు పెట్టమని సలహా ఇచ్చింది. ఒకవేళ మార్చకపోతే ‘ఏ’ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పింది. ‘కపుల్ ఫ్రెండ్లీ’ టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులకు చేరువైంది. విడుదల తేదీ సమీపిస్తుండగా ఇప్పుడు పేరు మార్చడం సరికాదని అనిపించింది. అందుకే టైటిల్‌ను ఛేంజ్ చేయకుండా ‘ఏ’సర్టిఫికెట్ తీసుకున్నాం. అంతమాత్రాన ఈ సినిమాలో అసభ్యత ఉందని అనుకుంటే పొరపాటే. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉంటాయి. కేవలం టైటిల్‌ని బట్టి సినిమాని తప్పుగా అర్థం చేసుకోవడం కరెక్ట్ కాదు’’ అని ధీరజ్ వివరించారు. క్లిష్టమైన టైటిల్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందన్న ప్రశ్నపై సంతోశ్ శోభన్ స్పందించారు. ‘‘ఈ టైటిల్ ప్రేక్షకులకు రీచ్ అవుతుందా, లేదా? అని తొలుత నేనూ సందేహించా. కానీ, టీమ్‌కు నమ్మకం ఉంది. వారి వివరణతో నేను రిలాక్స్ అయ్యా. సినిమా ప్రారంభంలోనే టైటిల్‌కు జస్టిఫికేషన్ ఉంటుందన్నారు.




### సినిమా విడుదలకు ముందు వణికిపోతాను ..అనిల్ రావిపూడి



అనిల్ రావిపూడి దగ్గర రైటర్ వర్క్ చేసి ఇప్పుడు ఓ సినిమాను తెరకెక్కించారు సాయి కృష్ణ. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘హై’. అనన్య శర్మ, పల్లవి దొర, కృష్ణకమల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. తాజాగా ఈ చిత్రబృందం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనిల్ మాట్లాడుతూ.. ‘నా సినిమా విడుదలకు ముందు రిజల్ట్ ఎలా ఉంటుందో అని వణికిపోతాను. సాయి మాత్రం కచ్చితంగా రూ.300కోట్లు వసూళ్లు చేస్తుందని చెబుతాడు. సినిమాను అంత బాగా అంచనా వేయగలడు’ అని చెప్పారు.

## ‘వారణాసి’లో ప్రియాంక.. నిక్ జోనస్ రియాక్షనిదే..



ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా నటిస్తోన్న చిత్రం ‘వారణాసి’. ఇందులో ప్రియాంక చోప్రా.. మందాకిని అనే ప్రధాన పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఆమె భర్త నిక్ జోనస్ మొదటిసారి స్పందించారు. ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. ‘‘తను 14 నెలల నుంచి ఓ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. ‘ఆర్ఆర్ఆర్’ లాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దీన్ని రూపొందిస్తున్నారు. ఆయన నుంచి వస్తోన్న మరో భారీ చిత్రమిది. అద్భుతంగా ఉండనుంది’’ అని చెప్పారు. ఈ సందర్భంగా నిక్ భారతీయ చిత్రాల గురించి మాట్లాడారు. తనకు ఇండియన్ సినిమాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. గొప్ప చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. భారతీయ సంగీతమన్నా అభిమానమన్నారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉందని అది తనకు చాలా ఇష్టమన్నారు. ఏదైనా వేడుక జరిగినప్పుడు అందరూ కలిసి సరదాగా ఉంటారని తెలిపారు. ‘వారణాసి’ విషయానికొస్తే.. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ మూవీ 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.


## రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు.. రూ.కోట్లు డిమాండ్

బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బెదిరింపులు వచ్చాయి. వాట్సప్ వాయిస్ నోట్ ద్వారా ఓ దుండగుడు ఆయన్ను బెదిరించాడు. నటుడి నుంచి రూ. కోట్లు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసుల దృష్టికి రణ్‌వీర్ తీసుకెళ్లడంతో విచారణ మొదలు పెట్టినట్లు సమాచారం. బెదిరింపుల నేపథ్యంలో రణ్‌వీర్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. జుహు (ముంబయి)లోని బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్ శెట్టి నివాసం వద్ద ఇటీవల కాల్పులు జరిగాయి. ఈ ఘటన చోటుచేసుకున్న పది రోజుల్లోనే రణ్‌వీర్‌కు బెదిరింపులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రణ్‌వీర్ లేటెస్ట్ మూవీ ‘ధురంధర్’ రూ.1300+ కోట్ల కలెక్షన్లతో రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.



## ఈషారెబ్బా.. ‘ఓం శాంతి శాంతి శాంతిః’

విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్న తెలుగమ్మాయి ఈషారెబ్బా. ‘ఓం శాంతి శాంతి శాంతిః’ లో కొత్త కోణాన్ని ఆవిష్కరించనున్నారు. జనవరి 30న సినిమా విడుదల సందర్భంగా ఆమె గురించి కొన్ని విశేషాలివీ.. ‘ఓం శాంతి శాంతి శాంతిః’లో శాంతి పాత్ర పోషించారు ఈషా. దర్శకుడు తరుణ్ భాస్కర్‌కు హీరోగా తొలి చిత్రమిది.అహంకారం కలిగిన భర్తకు భార్య బుద్ధి చెప్పడం క్లుప్తంగా ఈ సినిమా కథాంశం. కొవిడ్ సమయంలో తాను నేర్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈ రోల్‌కు పనికొచ్చిందని ఈషా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.తాను నటించిన గత చిత్రాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోడంతో ఆచితూచి కథలపై నిర్ణయం తీసుకుంటున్నారు.హైదరాబాద్‌లో పెరిగిన ఆమె.. ఎంబీఏ పూర్తి చేశారు. సినిమాలపై ఆసక్తి ఉన్నా నటి కావాలని ఎప్పుడూ అనుకోలేదు. కాలేజీ స్టూడెంట్ దశలో మోడలింగ్ చేసే సమయంలో పలు వాణిజ్య ప్రకటనల్లో నటించారు.ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా మీడియా, ఓ టెలివిజన్ షోకు పని చేయడంతో యాక్టింగ్‌పై ఇష్టం కలిగింది. అలా ‘లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్’లో ఓ చిన్న పాత్రలో కనిపించగా.. ‘అంతకుముందు ఆ తరువాత’తో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు.తెలుగులో జోరు ప్రదర్శిస్తూనే తమిళం, మలయాళం చిత్ర పరిశ్రమల్లో అడుగుపెట్టారు. సినిమాలకే పరిమితం కాకుండా ‘3 రోజెస్’, ‘దయా’లాంటి వెబ్‌సిరీస్‌లతోనూ ఆకట్టుకున్నారు.ఇష్టమైన హీరో: బ్రాడ్‌లీ కూపర్, ఫేవరెట్ హీరోయిన్: దీపికా పదుకొణె.ఖాళీ సమయంలో వంట చేయడం ఇష్టం. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు.



# 8 నెలల గర్భంతో బరిలోకి..



గర్భం దాల్చితే ఆటల్లో కొనసాగడం చాలా కష్టం. అలాంటిది 8 నెలల గర్భంతో బరిలోకి దిగడమే కాక.. పతకాలూ గెలిచింది మేఘన సజ్జనార్. కర్ణాటకకు చెందిన 32 ఏళ్ల ఈ షూటర్.. ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, టీమ్‌లో స్వర్ణం కైవసం చేసుకుంది. ''కొందరు అథ్లెట్లు ఒలింపిక్స్‌లో గర్భంతోనూ పోటీపడ్డారు. కానీ భారత్ లాంటి దేశంలో అలా ఆడడాన్ని అందరూ సమ్మతించరు. 'ప్రసవించే ముందు రోజు వరకు కూడా ఆడొచ్చు' అని వైద్యులు ఇచ్చిన సలహా మేరకు ధైర్యంగా షూటింగ్‌లో కొనసాగాను. టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకున్నా. షూటింగ్‌లో ఎంతో ఏకాగ్రత కావాలి. ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయినా సవాల్‌గా తీసుకుని బరిలో దిగా. పోటీల సమయంలో ఒక్కోసారి ఊపిరి తీసుకోవడం కష్టంగా అనిపించేది'' అని మేఘన చెప్పింది. బిడ్డకు జన్మనిచ్చాక.. సెప్టెంబరులో ఆసియా క్రీడల సమయానికి పునరాగమనం చేయాలని మేఘన లక్ష్యంగా పెట్టుకుంది.

# మనుకు రజతం, ఇషాకు కాంస్యం





## –ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కాంస్యంతో మెరిసింది. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా 30 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. స్టార్ షూటర్ మను బాకర్ త్రుటిలో స్వర్ణం కోల్పోయింది. రెండో స్థానంలో నిలిచి రజతం గెలిచింది. నుయెన్ ట్రాంగ్ (వియత్నాం) విజేతగా నిలిచింది. ఫైనల్లో మను, ట్రాంగ్‌ల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇద్దరూ 35 పాయింట్లతో సమానంగా నిలవగా.. షూటాఫ్‌లో నుయెన్ పైచేయి సాధించింది. మను, ఇషా, సాంగ్వాన్ త్రయం (1751) టీమ్ విభాగంలో స్వర్ణం గెలిచింది. చైనీస్ తైపీ (1735), వియత్నాం (1729) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# ఆకృతికి రజతం



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆకృతి దహియా, అంజుమ్ మౌద్గిల్ సత్తాచాటారు. మంగళవారం జరిగిన పోటీల్లో ఆకృతి రజతం, అంజుమ్ కాంస్య పతకాలతో మెరిశారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో ఆకృతి (354.2) రెండు, అంజుమ్ (340.4) మూడో స్థానాల్లో నిలిచారు. సోఫియా షుజెంకో (358.2 కజకిస్తాన్) ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఆసియా, ప్రపంచ జూనియర్, ఆసియా జూనియర్ రికార్డుల్ని సైతం సోఫియా తిరగరాసింది. జూనియర్ మహిళల 3 పొజిషన్‌లో ప్రాచి గైక్వాడ్ (353.3) స్వర్ణం, తొమిరిస్ అమనోవా (351.4 కజకిస్తాన్) రజతం, అనుష్క తోకుర్ (341.1) కాంస్యం సాధించారు. ప్రాచి, అనుష్క, హేజెల్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది.

# భారత్‌తో ఆడతాం

## -–ప్రకటించిన పాకిస్థాన్ , –బహిష్కరణపై వెనక్కి

సంక్షోభానికి తెరపడింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ షెడ్యూలు ప్రకారమే జరగనుంది. ఆ మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొంది. భారత్, పాక్ మ్యాచ్ ఈ నెల 15న కొలంబోలో జరగనుంది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ), ఐసీసీ మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పునరాలోచించాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని కోరాయి. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు తాను విజ్ఞప్తి చేసినట్లు బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ చెప్పాడు. శ్రీలంక ప్రధాని అనుర కుమార కూడా పాక్ ప్రధాని షరీఫ్‌తో ఫోన్లో మాట్లాడారని పాక్ ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్‌లతో ముక్కోణపు సిరీస్‌ను నిర్వహించాలన్న పీసీబీ డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ప్రపంచకప్‌నకు దూరం కావడంతో బంగ్లాకు కలిగిన ఆర్థిక నష్టాన్ని పూడ్చేందుకు పీసీబీ ఈ ప్రతిపాదన చేసింది. భారత్‌తో ద్వైపాక్షిక క్రికెట్ పునరుద్ధరణకు కూడా పీసీబీ డిమాండ్ చేసింది. కానీ అది ఐసీసీ చేతుల్లో లేని విషయం. అయితే వచ్చే అండర్19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను బంగ్లాకు కట్టబెట్టే అవకాశాన్ని ఐసీసీ పరిశీలించే అవకాశముంది. భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడేందుకు తిరస్కరించినందుకు బంగ్లాదేశ్‌పై ఎలాంటి ఆంక్షలు విధించబోమని ఐసీసీ స్పష్టం చేసింది.

# డ్రామా పండలేదు.. పాక్ యూటర్న్‌తో నఖ్వీ క్లీన్‌బౌల్డ్..!



చేతులు కాలాక.. ఆకులు పట్టుకుంటే ఏం లాభం..! పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. అంతర్జాతీయ సమాజం ముందు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించేందుకు పాక్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ (Mohsin Naqvi) ఆడిన పొలిటికల్ డ్రామాతో ఆ దేశం మరోసారి పరువు పోగొట్టుకుంది. ఆటగాళ్ల భద్రత అంటూ సానుభూతి కార్డు ప్లే చేసిన దాయాది.. భంగపాటు ఎదుర్కోక తప్పలేదు. ఈ యూటర్న్ ఊహించినదే అయినా.. పాక్ రాజకీయ క్రీడలో ఆ దేశ క్రికెట్ (Pakistan Cricket) ఎంతటి పతనావస్థకు చేరుకుందో స్పష్టమైంది.

**మునీర్ అండతో నఖ్వీ పాచికలు..** ''నన్ను గానీ, పాకిస్థాన్ (Pakistan) ప్రభుత్వాన్ని గానీ ఐసీసీ, భారత్ భయపెట్టలేదు. మాకు ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిమ్ మునీర్ ఉన్నారు. ఆయన గురించి మీకు బాగా తెలుసు. మునీర్ ఎవరికీ భయపడరు''.. భారత్‌తో మ్యాచ్‌పై యూటర్న్ తీసుకోవడానికి ముందు పీసీబీ చీఫ్ నఖ్వీ చెప్పిన మాటలివి. రాజకీయాలను క్రీడలతో ముడిపెట్టొద్దంటూ ఓ వైపు చిలకపలుకులు వల్లిస్తూనే.. ఇప్పుడు మిలిటరీ పేరుతో బెదిరింపులకు పాల్పడి దాయాది తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది. నఖ్వీ బెదిరింపులు చేయడం కొత్తేమీ కాదు. వీటి వెనుక మునీర్ అండ ఉందనేది ఎంతోకాలంగా ప్రచారంలో ఉన్న మాట. వాస్తవానికి మునీర్ సతీమణి ఇరుమ్ ఆసీమ్‌కు నఖ్వీ దగ్గరి బంధువు. ఆ కారణంతోనే నఖ్వీకి పీసీబీ ఛైర్మన్, పాక్ క్యాబినెట్‌లో మంత్రి పదవి దక్కాయనేది కాదనలేని నిజం. పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీతోనూ నఖ్వీకి దగ్గరి సంబంధాలున్నాయి. **బంగ్లా పేరు చెప్పి పరువు కాపాడుకోవాలని..** భారత్‌తో మ్యాచ్ ఆడుతామంటూ పాక్ ప్రకటించిన తర్వాత పీసీబీ చీఫ్ నఖ్వీ మరో ప్రకటన చేశారు. ''మేం మా సొంత ప్రయోజనాల కోసం ఏం చేయలేదు. బంగ్లాదేశ్ తరఫున నిలబడాలని ప్రయత్నించాం. ప్రాంతీయ భద్రత గురించి ఆలోచించాం. ఇప్పుడు భారత్‌తో మ్యాచ్ ఆడాలని బంగ్లాదేశ్ అభ్యర్థించింది. అందుకే మేం నిర్ణయం తీసుకున్నాం'' అని చెప్పారు. బెదిరింపులతో అంతర్జాతీయ క్రికెట్ వేదికపై పరువు పోగొట్టుకున్న పాక్.. ఇప్పుడు బంగ్లా పేరు చెప్పి సానుభూతి పొందాలని ప్రయత్నిస్తోంది. భారత్‌తో బంగ్లాదేశ్‌కున్న విభేదాలను ఆసరాగా తీసుకుని ఆ దేశానికి మళ్లీ దగ్గరవ్వాలని పాక్ ఆరాటపడుతోంది. ఇప్పుడు టీ20 ప్రపంచకప్ (T20 WorldCup)ను కూడా ఆయుధంగా వాడుకోవాలని ప్రయత్నించి భంగపడింది.

**కుయుక్తులు కొత్తేం కాదు..** యూటర్నులు, బహిష్కరణ బెదిరింపులు నఖ్వీకి అలవాటే. ఆ మధ్య ఆసియా కప్ 2025 టోర్నీలో పాక్ ఆటగాళ్లకు టీమ్ఇండియా షేక్ హ్యాండ్ ఇవ్వలేదన్న కారణంతో మ్యాచ్ రిఫరీని తొలగించాలని పట్టుబట్టాడు. అది కుదరకపోయేసరికి యూఏఈతో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బెదిరింపులకు దిగాడు. కానీ, మ్యాచ్‌కు కొన్ని నిమిషాల ముందు యూటర్న్ తీసుకుని తన ద్వంద్వ వైఖరిని బయటపెట్టాడు. ఇక, అదే టోర్నీలో భారత్ విజయం సాధించగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ఉన్న నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు టీమ్ఇండియా నిరాకరించింది. దీంతో ఏకంగా ట్రోఫీ తీసుకుని ఆఫీసు నుంచి వెళ్లిపోవడం గమనార్హం.

**మీడియా నుంచి రాజకీయాల్లోకి..** నఖ్వీ తన కెరీర్ తొలినాళ్లలో సీఎన్ఎన్ న్యూస్ ఛానల్‌లో పనిచేశారు. ఆ సమయంలో ఓ కోర్టు వ్యవహారానికి సంబంధించి లంచం తీసుకున్నాడనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఆ తర్వాత సొంతంగా సిటీ న్యూస్ నెట్‌వర్క్ పేరుతో మీడియా సంస్థను ప్రారంభించాడు. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి 202324 మధ్య పంజాబ్‌కు కేర్‌టేకర్ సీఎంగా పనిచేశాడు. ఆ తర్వాత పంజాబ్ నుంచి సెనెటర్‌గా ఎన్నికై మంత్రిమండలిలో చోటు దక్కించుకున్నాడు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తర్వాత ప్రభుత్వంలో రెండో శక్తిమంతమైన నేతగా నఖ్వీకి పేరుంది. పాక్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా.. ఏసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు.

# అక్షర్‌పటేల్‌కు గ్రేడ్ సీ ఇవ్వడం ఏంటి?: ఆకాశ్‌చోప్రా



బీసీసీఐ (BCCI) తాజాగా ప్రకటించిన 202526కు సంబంధించిన వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాపై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా పెదవి విరిచాడు. టీ20 జట్టు వైస్ కెప్టెన్ అక్షర్‌పటేల్‌ను గ్రేడ్ సీలోకి తీసుకోవడం ఏంటని ప్రశ్నించాడు. బీసీసీఐ నూతన సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్‌లో ఏ+ గ్రేడ్‌ను తొలగించారు. ఏ గ్రేడ్‌లో కేవలం జస్‌ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజాకు మాత్రమే స్థానం కల్పించారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిని బీ గ్రేడ్‌లోకి తీసుకున్నారు. టీ20 వైస్ కెప్టెన్ అక్షర్‌పటేల్ మాత్రం బీ గ్రేడ్ నుంచి సీ గ్రేడ్‌కు వచ్చాడు. దీనిపై ఎక్స్ వేదికగా టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా విస్మయం వ్యక్తంచేశాడు. అలాగే హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్, కుల్‌దీప్ యాదవ్‌కు గ్రేడ్ ఏ స్థానం కల్పించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. అర్ష్‌దీప్‌సింగ్ సైతం గ్రేడ్ సీలో ఉండాల్సిన క్రికెటర్ కాదని ఆకాశ్ చోప్రా అన్నాడు.

**అతడు ఇంకా ఏం చేయాలి?...** 'అక్షర్ పటేల్.. తనకు అర్హత ఉన్నదాన్ని పొందాలంటే, ఇంకా ఏం చేయాలి? అతడు మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. అన్నింటి కన్నా ప్రధానంగా టీ20 వైస్ కెప్టెన్. అతడికి గ్రేడ్ సీ? జడేజా, గిల్ గ్రేడ్ ఏలో ఉంటే హార్దిక్, రాహుల్, కులదీప్ ఎందుకు లేరు? అర్ష్‌దీప్ సింగ్ గ్రేడ్ సీలో ఉండాల్సిన ఆటగాడు కాదు. (మెరుగైన గ్రేడ్‌లోకి తీసుకోవాల్సి ఉండాల్సిందన్న ఉద్దేశంలో)' అని ఎక్స్ వేదికగా బీసీసీఐని ప్రశ్నించాడు.

**––వారు చేసిన తప్పేంటి?...**

'గ్రేడ్ ఏలో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.. ఇలా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. రెండు ఫార్మాట్లు ఆడుతున్న గిల్, జడేజా.. గ్రేడ్ ఏలో ఉన్నప్పుడు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ చేసిన తప్పేంటి? కుల్‌దీప్ యాదవ్ మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. అక్షర్ పటేల్ భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్. వన్డేలు కూడా ఆడతాడు. టెస్టుల కోసమూ నిత్యం అందుబాటులో ఉంటాడు. అయినప్పటికీ గ్రేడ్ సీ ఇచ్చారు. అర్ష్‌దీప్ సింగ్ విషయాకొనికొస్తే.. అతడు భారత జట్టు అత్యుత్తమ టీ20 బౌలర్. అతడికి కూడా గ్రేడ్ సీ కేటాయించారు. మూడు ఫార్మాట్లు ఆడుతున్న మహ్మద్ సిరాజ్‌ను కేవలం గ్రేడ్ బీలోకి తీసుకున్నారు. నిజాయతీగా చెప్పాలంటే ఇదంతా నాకు సరిగా అనిపించడం లేదు. అక్షర్‌పటేల్‌ను కచ్చితంగా గ్రేడ్ ఏలోకి తీసుకొని ఉండాల్సింది' అని ఆకాశ్ చోప్రా కుండబద్దలు కొట్టినట్టుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# అక్కడ క్రికెట్... 233ఏళ్ల ముందే



ఈసారి టీ20 ప్రపంచకప్‌లో కొత్త జట్టు ఒక్కటే. అదే.. ఇటలీ. అయితే ఇప్పుడు ప్రపంచ క్రికెట్లో ఇటలీ పసికూనే. ప్రపంచకప్ కూడా దానికి కొత్తే కావచ్చు. కానీ రెండు శతాబ్దాల ముందే క్రికెట్ ఆడిన చరిత్ర ఆ దేశానికి ఉండడం విశేషం. 1793లో, అంటే 233 ఏళ్ల కిందట అక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. బ్రిటిష్ అధికారి హొరాషియో నెల్సన్ ఆ మ్యాచ్‌ను నిర్వహించాడట. అప్పట్లో నౌకాశ్రయంలో ఓడలన్నీ నిలిపి ఉంచిన సమయంలో వాటిలో పని చేసే, ప్రయాణించే వాళ్లంతా కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడారట. తర్వాత కూడా అడపాదడపా కొన్ని మ్యాచ్‌లు జరిగాయి. 1893లో ఇటలీ పురాతన ఫుట్‌బాల్ క్లబ్బుల్లో ఒకటైన జెనోవా.. మొదట జెనోవా క్రికెట్ అండ్ అథ్లెటిక్ క్లబ్‌గా ఏర్పాటైంది. కాలక్రమంలో అది జెనోవా క్రికెట్ అండ్ ఫుట్‌బాల్ క్లబ్‌గా మారింది. మరో ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ 'ఏసీ మిలన్' సైతం 1899లో 'మిలన్ ఫుట్‌బాల్ అండ్ క్రికెట్ క్లబ్'గా మొదలైంది. అయితే తర్వాతి కాలంలో క్రమంగా ఆ దేశంలో క్రికెట్ కనుమరుగైంది. ముఖ్యంగా 192243 మధ్య ఇటలీని నియంత అయిన ముసోలిని పాలించిన కాలంలో క్రికెట్ పూర్తిగా అంతరించింది. ఫుట్‌బాల్‌కే అగ్రతాంబూలం దక్కింది. అయితే గత కొన్నేళ్లలో అసోసియేట్ దేశాలకు ఐసీసీ మంచి ప్రోత్సాహం అందిస్తుండడం, ఐరోపాలో టీ20, టీ10 క్రికెట్ లీగ్‌స్‌కు ఆదరణ పెరగడం ఇటలీలో క్రికెట్ అభివృద్ధికి దోహదం చేసింది. స్థానికంగా క్రికెట్ ఆడే, కెరీర్‌గా ఎంచుకునే వారి సంఖ్య పెరిగింది. వీరికి వలస క్రికెటర్లు కూడా తోడవడంతో ఇటలీ ప్రపంచ క్రికెట్లో తనకంటూ ఓ స్థానం సంపాదించుకుంది. అయితే అమెరికా మాదిరి పూర్తిగా వలస క్రికెటర్లతో నిండిపోలేదు ఇటలీ జట్టు. జస్టిన్ మోస్కా, ఆంటోనీ మోస్కా, థామస్ డ్రాకా, జియాన్ మీడ్ లాంటి క్రికెటర్లు ఇటలీ దేశస్థులే. వీరికి తోడు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్లు బెన్ మానేటి, హ్యారీ మానేటి.. ఇంగ్లాండ్ ఆటగాళ్లు గ్రాంట్ స్టివార్ట్, వేన్ మ్యాడ్సన్.. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జేజే స్మట్స్ లాంటి ఆటగాళ్లతో ఇటలీ మెరుగ్గానే కనిపిస్తోంది. ఐరోపా క్వాలిఫయర్స్‌లో ఉత్తమ ప్రదర్శన చేసి, స్కాట్లాండ్ లాంటి పేరున్న జట్టు కంటే ముందు ఆ జట్టు టీ20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించడం విశేషం. తొలి మ్యాచ్‌లో సరిగా ఆడలేక స్కాట్లాండ్ చేతిలో ఓడింది కానీ.. ఇటలీ ఇంకా మెరుగైన ప్రదర్శన చేయగల సత్తా ఉన్న జట్టే. మరి తర్వాతి మ్యాచ్‌ల్లో ఆ జట్టు బలమైన ముద్ర వేస్తుందేమో చూద్దాం.

# నిర్ణయం మార్చుకున్నందుకు ధన్యవాదాలు

## .. పాక్ ప్రధానితో శ్రీలంక అధ్యక్షుడు



మొత్తానికి పాకిస్థాన్ దారికొచ్చింది. టీ20 వరల్డ్ కప్ 2026లో గ్రూప్ స్టేజిలో భారత్‌తో మ్యాచ్ ఆడబోమని బెట్టు చేసిన పాక్ చివరికి మెట్టు దిగిన విషయం తెలిసిందే. తమ అభ్యర్థనతో పాకిస్థాన్ నిర్ణయం మార్చుకున్నందుకు శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే పాక్ ప్రధాని షెహబాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 15న జరగబోయే భారత్‌పాక్ మ్యాచ్ వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాక్ జట్టుకు అనుమతి ఇచ్చినందుకు థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ షెహబాజ్. టీ20 క్రికెట్ వరల్‌డ్‌కప్‌లో భాగంగా.. షెడ్యూల్ ప్రకారం కొలంబోలో జరగనున్న భారత్, పాక్ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని శ్రీలంక అధ్యక్షుడు పేర్కొన్నాడు. 'ఈ టోర్నమెంట్‌కు సహ ఆతిథ్యదేశమైన శ్రీలంక.. ఐసీసీ ప్రయత్నాలకు ధన్యవాదాలు తెలియజేస్తోంది. 1996 ప్రపంచ కప్ సమయంలో, భద్రతా కారణాల వల్ల ఇతర దేశాలు దూరంగా ఉన్నప్పుడు.. భారత్, పాకిస్థాన్ కొలంబోలో ఆడటం ద్వారా చూపిన సంఘీభావాన్ని శ్రీలంక ఎప్పటికీ మర్చిపోలేదు' అని ఆయన అన్నారు. భారత్‌తో మ్యాచ్ ఆడబోమన్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

# ప్రస్తుతం ఒత్తిడి అంతా పాక్ పైనే..

## ..ఎందుకంటే!: యూఎస్ఏ ఆటగాడు



టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా మరికొన్ని గంటల్లోనే కొలంబో వేదికగా యూఎస్ఏ, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో యూఎస్ఏ క్రికెటర్ మహ్మద్ మొహ్సిన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం ఒత్తిడి అంతా పాక్ మీదే ఉందన్నాడు. తాము టీ20 వరల్‌డ్‌కప్ 2024లో పాకిస్థాన్‌ను ఓడించడమే దానికి కారణమన్నాడు. 'మేం ఇప్పటికే పాకిస్థాన్‌ను ఓడించాం. అందుకే ఒత్తిడి అంతా వారి మీదే ఉంటుంది. మేం మా బలాలను పెంచుకున్నాం. కాబట్టి మేం వారిని మరోసారి ఓడిస్తామనే నమ్మకం మాకుంది' అని మొహ్సిన్.. మ్యాచ్‌కు ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నాడు. 2024 జూన్ 6న అమెరికా క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యాన్ని గురిచేసింది. టీ20 వరల్‌డ్‌కప్ 2024లో డల్లాస్ వేదికగా పాక్‌తో జరిగిన మ్యాచ్ టై అయింది. అనంతరం నిర్వహించిన సూపర్ ఓవర్‌లో అమెరికా 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆనాడు టాస్ గెలిచిన అమెరికా మొదట బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 159 పరుగులు చేసింది. ఛేదనలో అమెరికా 20 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 159 పరుగులు చేసింది. సూపర్‌ఓవర్‌లో అమెరికా 1 వికెట్ నష్టపోయి 18 పరుగులు చేస్తే.. పాకిస్థాన్ 1 వికెట్ కోల్పోయి కేవలం 13 రన్స్ మాత్రమే చేసింది. దీంతో ఆ మ్యాచ్‌లో అమెరికా 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. 38 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50 పరుగులు చేసిన మోనాంక్ పటేల్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.